క్లుప్తంగా

రుణ అర్హత కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ముప్పాళ్ళ: కౌలు రైతులు రుణ అర్హత కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2,009 కార్డులు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,812 మందికి అందించామని పేర్కొన్నారు. అర్జీలను ఆయా గ్రామ వీఆర్వో లేదా వ్యవసాయశాఖ సిబ్బందికి అందించవచ్చని తెలిపారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తప్పనిసరిగా 'ఈ-పంట' నమోదు చేసుకోవాలి



బెల్లంకొండ: గ్రామాల్లో రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకునే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ శాఖాధికారి డి.కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం కందిపాడు గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేపడుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాలలోని అన్నీ సర్వే నంబర్లలో వేసిన వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలు విస్తీర్ణంతో సహా నమోదు చేయాలని సూచించారు. కౌలు రైతుల పంటల నమోదుకు సాగుదారు పత్రాలు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వ్యవసాయ సిబ్బంది అయ్యప్ప, శ్యాం ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ మాసోత్సవాలు

అచ్చంపేట: జాతీయ పశు వ్యాధి నియంత్ర పథకం – గాలి కుంటు వ్యాధి మాసోత్సవాలలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఈ నెల 20 నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పశు వైద్య, రైతు సేవా కేంద్రాలలో వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు.

కంటెపూడిలో తౌడు లారీ బోల్తా


సత్తెనపల్లి: తౌడు లారీ బోల్తా కొట్టిన ఘటన మండలంలోని కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాల వద్ద సోమవారం జరిగింది. సత్తెనపల్లి పట్టణం నుంచి తౌడు లారీ పేరేచర్ల వెళ్తోంది. కళాశాల వద్ద ఒక్కసారిగా డ్రైవర్ బ్రేక్ వేయడంతో లారీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ప్రాణాపాయం జరగలేదు. డ్రైవర్ తో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే మరో లారీలోకి తౌడు బస్తాలను ఎక్కించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేశారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు వివరాలు సేకరించారు.

గులాబీరంగు పురుగు నివారణకు చర్యలు



క్రోసూరు: పత్తి రైతులందరూ గులాబీ రంగు పురుగు నివారణకు సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం పీసపాడు గ్రామంలో పత్తి రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు. ఎకరాకు నాలుగు నుంచి ఎనిమిది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రైకో గ్రామా పరాన్న జీవులు ఎకరాకు 60 వేల చొప్పున మూడు విడతలుగా వారం రోజుల వ్యవధిలో విడుదల చేయటం వల్ల గుడ్ల దశలో ఉన్న పురుగును నివారించవచ్చునన్నారు. రైతులు, వీఆర్వో రామచంద్రయ్య, వీఆర్ఏ రాజశేఖర్, వీఏఏ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



టి.వంశీ (పాతచిత్రం)

ముప్పాళ్ళ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడిన సంగతి తెలిసిందే. గాయపడిన వారిలో నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామానికి చెందిన తెలగొర్ల వంశీ(17) అనే యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుందురువారిపాలెంలో మిత్రుడు ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు వచ్చి, మాదల గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి మిత్రులతో కలిసి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాం...మేమేం పాపం చేశామని దేవుడు మాకీ శిక్ష విధించాడయ్యా అంటూ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, ఆదిలక్ష్మీ రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

గ్రామాలను వణికిస్తున్న జ్వరాలు

బెల్లంకొండ: మండలంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ బారిన పడి గ్రామీణ ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. వర్షాలతో దోమ విజృంభన, అపరిశుభ్ర వాతావరణంతో బాధితుల సంఖ్య మరింత పెరుగుతోంది.



చంద్రాజుపాలెం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు



వైద్య శిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు

- ఆసుపత్రులకు చేరుతున్న టైఫాయిడ్ మలేరియా బాధితులు
- అపరిశుభ్ర వాతావరణం, వర్షాలతో దోమల విజృంభన

పారిశుద్ధ్య లోపం..

మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఏ గ్రామంలో చూసిన డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. వర్షం కురిసి సమయంలో మురుగు నీరు రహదారులపై ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల ఇళ్లలోకి కూడా చేరుతోంది.

విజృంభిస్తున్న జ్వరాలు

మండలంలో జనవరి నుంచి ఇప్పటి వరకు నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఆగస్టులో ఇప్పటి వరకు చంద్రాజుపాలెం పీహెచ్‌సీ పరిధిలో 65 మంది టైఫాయిడ్‌తో చికిత్స పొందారు. ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్‌లు, ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న వారు చాలా మంది ఉన్నారు. అలాగే 15 మంది మలేరియా బారిన పడ్డారు. దీంతో మండలంలో వైరల్ జ్వరాలు ఏ విధంగా ఉన్నాయో అర్థమవుతుంది.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



వర్షా కాలంలో వ్యాధులు ప్రబల కుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి. మురుగునీరు, చెత్తా చెదారం ఎక్కువగా ఉన్నచోట దోమలు, ఈగల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే డయేరియా, డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

– కేవీ కోటేశ్వరరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ చంద్రాజుపాలెం

హసనాబాద్‌కు అతిసారం

- పది రోజులుగా దొడ్లేరు పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం
- బోరు నీరు తాగి డయేరియా బారిన పడిన గ్రామస్తులు
- పాలకులు మారినా రక్షిత తాగు నీరు అందని గ్రామం
- ప్రారంభానికి నోచుకోని జలజీవన్ మిషన్ పథకం

హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామం అతిసారం బారిన పడింది. పది రోజులు క్రితం నుంచి ఆ గ్రామంలో అధికారిక లెక్కల ప్రకారం 21 మంది డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఆ సంఖ్య 40 నుంచి 50 వరకు ఉందని ఉందని తెలుస్తోంది. పది రోజులుగా నడుస్తున్న దొడ్లేరు పీహెచ్‌సీలోని వైద్య శిబిరంలో ఇప్పటికీ బాధితులు చికిత్స పొందుతున్నారు. గ్రామంలో సరైన రక్షిత తాగునీటి వ్యవస్థ లేకపోవడమే డయేరియా విజృంభనకు కారణం.



అతిసారకు కారణమైన బోరు పంపు



జలజీవన్ మిషన్ స్కీం లో నిర్మించిన కొత్త ఓవర్ హెడ్ ట్యాంకు

అతిసారం ప్రబలింది ఇలా..

హసనాబాద్ గ్రామ జనాభా 3 వేలు. పంచాయతీ ఆధ్వర్యంలో ఓవర్‌హెడ్ ట్యాంకు ఉంది. కానీ, దానికి రక్షిత తాగునీటి సరఫరా లేదు. దగ్గరలో బోరు వేసి మోటార్ ద్వారా ట్యాంకును నింపి, కొళాయిలకు నీటి పంపిణీ చేస్తున్నారు. అయితే ఆ బోరు నీరు సగం గ్రామానికి మాత్రమే సరఫరా అవుతుంది. ఈ నెల 8న గ్రామంలోని అంకమ్మతల్లి గుడి వద్ద ఉన్న బోరు పంపు నీరు తాగి గ్రామస్తులు అనేక మంది అస్వస్థతకు గురయ్యారు. దగ్గరలోని సత్తెనపల్లి, రెడ్డిగూడెం, పిడుగురాళ్లలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు.



ఇంటింటికీ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

హుటాహుటిన వైద్య శిబిరం

గ్రామస్తులు అతిసారం బారిన పడ్డారని తెలుసుకున్న అధికారులు హుటాహుటిన పీహెచ్‌సీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డయేరియాకు కారణమైన బోరు పంపును మూసివేశారు. అలాగే వైరల్ జ్వరాలతోనే గ్రామస్తులు పలు ఆసుపత్రుల్లో చేరారు. ఇప్పటికైనా రక్షిత తాగు నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రారంభంకానీ జలజీవన్ మిషన్ స్కీం

గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పునాది వేశారు. రూ.90 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో కొత్త ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. పైపు లైన్లు కూడా పూర్తి చేశారు. ఇంతలో అధికారం మారింది. ప్రారంభానికి నోచుకోలేదు. ఇది పూర్తయితే.. సురక్షితమైన కృష్ణా జలాలు గ్రామ ప్రజలకు అందించవచ్చు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ మాసోత్సవాలు

అచ్చంపేట: జాతీయ పశు వ్యాధి నియంత్ర పథకం – గాలి కుంటు వ్యాధి మాసోత్సవాలలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఈ నెల 20 నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పశు వైద్య, రైతు సేవా కేంద్రాలలో వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు. గాలి కుంటు వ్యాధిని సమూలంగా నశింపచేయడమే లక్ష్యంగా తమ సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు.

అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు రాఖీ కడుతున్న వందన దేవి



రాఖీ కడుతున్న చిన్నారులు

సత్తెనపల్లి: అన్నా చెల్లెళ్ల ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ అని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. టీడీపీ మహిళా నాయకురాలు బీమినేని వందనాదేవి రక్షా బంధన్ సందర్భంగా ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు.

క్రోసూరు: వైష్ణవ ఆలయాల్లో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెరికపాడు తండాలోని ఏటా రాఖీ పండగ అత్యంత ఉత్సాహంగా జరుగుతుంది. చెల్లెల్లు, అక్కలు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

■ సత్తెనపల్లి: రక్షా బంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని 6వ వార్డు మాజీ కౌన్సిలర్ తోట అంబిక కన్నా నాగరాజుకు రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కన్నా నాగరాజు మాట్లాడుతూ రక్షా బంధన్ కుటుంబ, సామాజిక, దేశ ఐక్యతకు చిహ్నమన్నారు.

■ అమరావతి: స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యాలయంలో సోమవారం రక్షా బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలు బాలురకు రాఖీ కట్టి సోదర భావాన్ని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు అమరేశ్వస్వామి దేవాలయంలో వృక్షాలకు రాఖీలు కట్టారు. నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష, మనందరం దేశానికి రక్ష అంటూ రాఖీ పండగ ఔన్నత్యాన్ని తెలియజేశారు. ఉపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, పవన్ కుమార్, వారణాసి వెంకటేశ్వర శర్మ ఉన్నారు.

దాచేపల్లి ఎంపీపీగా జాను నియామకం

దాచేపల్లి : మండల పరిషత్ అధ్యక్షుడిగా సారంగపల్లి అగ్రహారం ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కందుల జాను నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శోభారాణి సోమవారం ఎంపీపీ జానుకి అందజేసి సన్మానించారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీపీ జానుని సన్మానించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎంపీపీ కందుల జాను అన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు..ఆరుగురు న్యాయవాదుల పోటీ



ఎస్.ఆంజనేయులు



జి.అజయ్‌కుమార్



బి.లక్ష్మీ చిన్నయ్య



ఎం.వెంకటచలపతిరావు



కె.వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు ఆరుగురు న్యాయవాదులు పోటీ పడుతున్నారు. పట్టణానికి చెందిన న్యాయవాదులు నల్లిబోయిన ఆంజనేయులు, గంగూరి అజయ్ కుమార్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేశారు. సోమవారం న్యాయవాదులు బోడపాటి లక్ష్మీ చిన్నయ్య, మద్దినేని వెంకటచలపతిరావు, కొల్లా వెంకటేశ్వరరావు, షేక్ జానీ ఖాజావలి దరఖాస్తు చేశారు. మొత్తం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పదవి కాలం మూడేళ్లు కొనసాగుతుంది. గత ప్రభుత్వ హయాంలో 2020 నవంబర్ 23న న్యాయవాది మారూరి లింగారెడ్డి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు ఎంపికయ్యారు. 2023 నవంబర్ 23 వరకు ఆయన పనిచేశారు. అప్పట్లో నాటి మంత్రి అంబటి రాంబాబు మరో ఏడాది కాలానికి సిఫార్సు చేయగా ఆయన పదవిలో కొనసాగారు. కూటమి ప్రభుత్వం రావడంతో.. 2024 జూలై 15న మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి మారూరు లింగారెడ్డి రాజీనామా చేశారు. ప్రస్తుతం నూతన ప్రభుత్వంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ దక్కించుకునేందుకు న్యాయవాదులు పోటీ పడుతున్నారు. దరఖాస్తు చేసుకున్న ఆరుగురు న్యాయవాదుల్లో నల్లిబోయిన ఆంజనేయులు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, షేక్ జానీఖాజావలి మైనార్టీ సామాజికవర్గానికి చెందిన వారు. మిగిలిన నలుగురు గంగూరి అజయ్‌కుమార్, బోడపాటి. లక్ష్మీ చిన్నయ్య, మద్దినేని వెంకటచలపతిరావు, కొల్లా వెంకటేశ్వరరావులు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు.



షేక్ జానీ ఖాజావలి

ఇదీ ఇలా ఉంటే దరఖాస్తు చేసి ఉంటే మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు అవకాశం లేకపోతే భవిష్యత్తులో మరోదానికి ప్రాధాన్యత ఇస్తారనే ఉద్దేశంతో దరఖాస్తు చేసిన వారు సైతం లేక పోలేదు. ఒకరికే మూడేళ్లు కాకుండా ఒక్కో న్యాయవాదికి ఏడాది పాటు అవకాశం కల్పిస్తే ఎక్కువ మందికి అవకాశం కల్పించి నట్లు ఉంటుందని సీనియర్ న్యాయవాది ఒకరు సూచించినట్లు సమాచారం. లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఉన్న న్యాయవాది మద్దినేని వెంకటచలపతి ఆధ్వర్యంలో న్యాయవాదులు చర్చించుకొని ఒక పేరు చెబితే దానిని సిఫార్స్ చేస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పినట్లు సమాచారం. ఆరుగురిలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పదవి ఎవరిని వరించనుంది? సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ ఎవరికి సిఫార్సు చేస్తారో వేచి చూడాలి.

దేవరంపాడులో ఉచిత పశువైద్య శిబిరం

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం సోమవారం నిర్వహించారు. ఎదకు రాని 40 గేదెలకు పరీక్షలు చేసి, 12 తిరగ పొర్లే పశువులను గుర్తించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ జి.వీరయ్య మాట్లాడుతూ గేదెలు ఈనిన తర్వాత 40 రోజుల నుంచి 90 రోజుల లోపే ఎదకు వచ్చేలా సరైన యాజమాన్య పద్ధతలను అనుసరించాలన్నారు. దీంతో ప్రతి ఏడాది ఒక దూడను పొందవచ్చని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ కె.నాగేశ్వరరావు(మొక్కపాడు), డాక్టర్ ఎం.పుల్లారెడ్డి(మాదల), సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, పశువైద్య సిబ్బంది ఆదినారాయణ, తేజ, అణుకు, రమ్య, కిరణ్, ఇందు రైతులు పాల్గొన్నారు.



చూడి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వీరయ్య

విద్యా ప్రమాణాలు పాటించాలి



చినలింగాయపాలెం(కాకుమాను): ప్రతి పాఠశాలలో విద్యా ప్రమాణాలు పాటించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వారానికోసారి ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలను పరిశీలించి, తరగతిలో వెనుకపడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

యువకుడి ఉసురు తీసిన క్షణికావేశం



బొల్లాపల్లి: నాగార్జునసాగర్ ప్రధాన కుడికాలువలో యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. బండ్లమోటు ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రావులాపురం గ్రామానికి చెందిన యలగాల వెంకటేశ్వర్లు (20) క్షణికావేశంలో కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 17వ తారీకు రాత్రి బస్సులో వినుకొండ నుంచి రావులాపురం వెళ్తూ మార్గమధ్యంలోని మూగచింతలపాలెం వద్ద ఉన్న కాలువలో దూకినట్లు మృతుడి తండ్రి యలగాల మన్నెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. రెండు రోజుల పాటు కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మండలంలోని సంగినీడు పాలెం సీతారామపురం తండా పరిసర ప్రాంతంలోని ఎన్ఎస్పీ కుడి కాలువలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. యలగాల మన్నెయ్యకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. వీరిలో కుమారుడు వెంకటేశ్వర్లు మృతితో కుటుంబం రోదనలు మిన్నంటాయి. కుటుంబానికి ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటున్నాడని, వినుకొండ పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. క్షణికావేశంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందడం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పథకాల లబ్ధికి 'ఈ-పంట' ఆధారం

నకరికల్లు: రైతులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ-పంట నమోదు మూలాధారమని మండల వ్యవసాయాధికాఖ అధికారి కె.దేవదాసు అన్నారు. త్రిపురాపురం, నర్శింగపాడు గ్రామాల్లో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రైతులు తాము సాగు చేస్తున్న పంట వివరాలు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబరు ఇచ్చి ఈ-పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. సున్నా వడ్డీ రుణాలు, పంటల బీమా, ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించుకునేందుకు, పంట నష్టం పరిహారం పొందేందుకు ఈ-పంట నమోదు కీలకమన్నారు. వాస్తవ సాగుదారులు, కౌలు రైతులు సెప్టెంబరు 15వ తేదీలోగా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు జాన్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.



త్రిపురాపురంలో రైతులకు వివరిస్తున్న ఏఓ కె.దేవదాసు

వెయ్యి ఎకరాల్లోని పంటలే నమోదయ్యాయి

అమరావతి: ప్రతి రైతు సాగు చేస్తున్న పంటలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ చెప్పారు. సోమవారం ధరణికోట గ్రామంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. మండలంలో 15 వేల ఎకరాల్లో పత్తి, వెయ్యి ఎకరాల్లో అపరాలు రైతులు సాగు చేస్తున్నారని ఏఓ ఈ సందర్భంగా తెలిపారు. కానీ, ఇప్పటి వరకు 1010 ఎకరాల పంట మాత్రమే ఈ-పంట యాప్‌లో నమోదైనట్లు వెల్లడించారు. నమోదుకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో అయా గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. పంట నమోదు చేసుకుంటే విత్తన సబ్సిడీ, ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని స్పష్టం చేశారు.



ధరణికోటలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏవో అహ్మద్

భక్తిశ్రద్ధలతో విఖనసాచార్య స్వామి వార్షిక జయంతి



శ్రీ విఖనసాచార్య స్వామికి పూజలు



సత్కారం అందుకుంటున్న డాక్టర్ పరాశరం వేణుగోపాలాచార్యులు దంపతులు

సత్తెనపల్లి: శ్రావణ పూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీ విఖనసాచార్య స్వామి వారి వార్షిక జయంతి మహోత్సవం వికనస మండలి సత్తెనపల్లి డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహం అష్ట దిక్పాలక పూజ, నవ గ్రహ పూజ, ఆఘూరం, ఉపాకర్మ హోమం(ముంజ విడుపు), విశేష స్నపన, అలంకరణ ఆలయోత్సవం, విశేష పూజలు పూజారి వేదాంతం రమణా చార్యులు నిర్వహించారు. వికనస మండలి సత్తెనపల్లి డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా వేదాంతం ధన్వంతరి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గుడిపూడి తులసీకృష్ణ భట్టు, రొంపిచర్ల వాసుదేవమూర్తి, సెక్రటరీగా నల్లూరి శ్రీనివాసమూర్తి, ట్రెజరర్‌గా నారాయణ లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా గుంటూరు సురేష్, పరాశరం రాజశేఖర్, పరాశరం యువకిషోర్, తాళ్లూరి ఆంజనేయ ప్రసాద్, తాళ్లూరి వెంకటరమణ, గౌరవ సలహాదారుడిగా వేదాంతం శ్రీనివాసా చార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా పని చేసిన వేదాంతం రామకృష్ణమాచార్యులు, నూతన అధ్యక్షుడు వేదాంతం ధన్వంతరి విజయ్ కుమార్, వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ పరాశరం వేణుగోపాలాచార్యులు, డాక్టర్ పరుచూరి తిరుములాచార్యులను సత్కరించారు. అనంతరం క్రోసూరు మండలం 88 తాళ్లూరు గ్రామానికి చెందిన పరాశరం తేజ్ సాయి సుదర్శన్, అమరావతి మండలం మల్లాది గ్రామానికి చెందిన పరుచూరి ఇందీవర శ్యామ్‌కు విద్యార్థి ప్రతిభా పురస్కారాలు అందజేసి, సత్కరించారు.

విద్యుత్ సిబ్బందికి అభినందనలు

గురజాల : ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగి పోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులు రావడంతో విద్యుత్ స్తంభాలపై పింగాణీలు కాలిపోయి, విద్యుత్ వైర్లు తెగి కిందపడిపోవడంతో సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కురుస్తున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది సమస్య పరిష్కారానికి.. రాత్రి 12 గంటల వరకు పని చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో విద్యుత్ సిబ్బందిని పలువురు విద్యుత్ వినియోగదారులు అభినందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

దాచేపల్లి : కోల్‌కతాలో డాక్టర్‌పై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి దాచేపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాచేపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి పల్నాడు బలహీనవర్గాల సమాఖ్య, డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్ నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ దాచేపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతిపత్రాన్ని విగ్రహం వద్ద పెట్టారు. డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డాక్టర్ కర్నాటి వరలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా డాక్టర్ హత్య వెనుక ఉన్న నిందితులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ శ్రీరామనేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు ఆలోచన చేయాలని, వైద్యులపై ఇటువంటి దాడులు చేయటం హేయమైన చర్య అని ఖండించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కనుమూరి విక్రాంత్, సత్యనారాయణరెడ్డి, సాయికర్ల నిషాంత్, అలేఖ్య, రఘు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.